

# నా ప్రణయ పత్రాలు

కన్నడమూలం శ్రీ బీచి
అనువాదం శర్వాణి

“చా? కాపి తెస్తున్నా సామీ”

“కాపి తెస్తున్నా, చా కావాలా?”

“వక్క పలుకు వద్దా?”

“సిగరెట్లు వుండా?”

అస్తమానం ఏదో ఒకటి మాట్లాడుతూ వుండకపోతే తోచనే తోచదు, చొక్కమ్మకు. అదో జబ్బుగా తయారయింది. మిగత అన్నిట్లోనూ బంగారం లాంటిది చొక్కమ్మ. అంత పెద్ద మద్రాసు పట్నంలో అలాంటి మనిషి దొరకనే దొరకదు మరి.

మాంచి నమ్మకమైన మనిషి. ఎదురుగా కనిపిస్తున్న నయాపైసా ముట్టుకోదు. శుభ్రంగా పని చేసేది. నేను ఇస్తున్న ఎనిమిది రూపాయిలకు ఇంత నమ్మకమైన వారు మరెవరు దొరుకుతారు. అందులో మద్రాసులో!

ఆ వయసుకే అంత శాంతం, ఓర్పు సహనం ఎలా వచ్చిందో మరి? బీదదే కావచ్చు — కాని గుణానికి కాదు.

కాని అస్తమానం వాగుతూవుండే జబ్బుకు మందో?

కాఫీ తెచ్చి బల్లమీద పెట్టింది. టీ తెమ్మన్నాను. కాఫీ తెచ్చింది. ఎందుకని అడగలేదు. ఇహ మళ్ళి పురాణం మొదలు పెడుతుందనే భయంచేత.

“ఇదుగో చొక్కమ్మా, నేను రాసుకునేటప్పుడు పలకరించవాకు. ఇబ్బందవుతుంది నాకు. తెలిసిందా” అన్నాను కావాలనే కాస్త కటువుగా.

అదీ తప్పే అయి కూచుంది.

“కాస్త మాటాడే పనుంది సామి మీతో... ఏటంటే....”

అరవధాటిలో ప్రారంభించింది.

పెన్ను క్రింద పెట్టాను. మోచేతిని గడ్డానికి ఆన్చి హాయిగా కూర్చున్నాను. ఏం చెపుతుందో మహాతల్లి చెప్పెయ్యనీ అనుకుంటూ.

“అస్తమానం ఏదో రాసీ రాసీ రాత్తుంటారు గదా. నాకో పుత్తరం రాసి పెట్టండి సామి, అరవంలో”

“నాకు అరవం రాదే? నువ్వు ఇక్కడి దానివేగా? నీకు అరవం రాదా?” అని తప్పించుకో చూశాను.

“నేనేమైనా ఇస్కూలు మొహం సూస్తినా? రాయటం వత్తాదా నాకు? ఇంతో అంతో సదువుతానంతే. ఫర్లేదు. మీా కన్నడంలోనే రాయండి. ఆడికి కన్నడం వచ్చు.”

“ఎవరికి?”

కొంగుతో మొహం కప్పుకొంటూ అదో మాదిరిగా నవ్వింది. సిగ్గుపడుతోంది పాపం!

"మొగుడా? మెడలో తాళిబొట్టు లేదే?"

అడగటానికి సంకోచం నాకు.

"పెళ్ళయిందా చొక్కమ్మా నీకు."

"చేసుకొంటాడు సామి ముందు పేడు" అంది తలొంచుకొని, సిగ్గుతో మొహం దాచుకుంది.

ఎవరైతేనేం, పాపం! తను మాత్రం మనిషి కాదా? పేదదైతేనేం, అందరిలాగా జీవితంలో ఆశ— ఆ కాంక్ష, నవ్వు, ప్రణయం వుండకూడదా? చొక్కమ్మ వయసులో వున్నదే మరి.

చొక్కమ్మకు రాయటం రాదు. దూరాపు వూళ్ళోవున్న తన ప్రియునికి తన మనసు లోని ప్రేమ అందించటం ఎలా? పాపం తోకలేని కుక్క పరిస్థితి.

నిజమే, బాగుంది కాని.... అందుకని నేను రాస్తూ కూచోవాలా ఆమె ప్రణయ పత్రాలను??

ఏం? ఎందుకు రాయకూడదు? తప్పేమిటందులో ఇవ్వాళ కాకపోతే రేపు పెళ్ళి చేసుకుంటుంది. కాబోయె భర్తకు వుత్తరాలు రాస్తే అందులో అవినీతి ఏముంది? చొక్కమ్మ దారి తప్పిన ఆడదా?

వేలకొలది పేజీలు రాసిన చెయ్యినాది. పెన్ను చేతిలోకి తీసుకొన్నాను.

"ఊఁ, చెప్పు చొక్కమ్మా, ఏంరాయాలి?"

"ఐ, భలె సామి.. మీకు సెప్పాలా నేను? ఎప్పుడూ ఏ ఆడది మీకు రాయనేలేదూ పేమ లేకలు?"

చూశారా ఎలావుందో చొక్కమ్మ ప్రశ్న. ఇహ దీని కేం జవాబు చెప్పగలను?.

"అది కాదు. విషయం ఏమిటి అని అడిగానంతె. డబ్బు గిబ్బు పంపించమని రాయాలా?"

"చత్. వాడి డబ్బు ముడతానా నేను? బగమంతుడు ఎందుకు నాకు సత్తువ ఇచ్చాడు 'సన్జేసి బతుకు' అని కాదా?"

"అయితే ఒక్కసారి వచ్చి వెళ్ళమని రాయ మంటావా?"

"ఆ మాట నేను సెప్పాలా ఆడికి? మనసులో ప్రీతివుంటె ఆడే వస్తాడు. అలా ఏడ్చే ఆడదికాదు సామి నేను"

"భలె" అని మనసులోనే మెచ్చు కొన్నాను. ఏమో అనుకొన్న ఈ చొక్కమ్మకు ఎంత స్వాభిమానం!

"రాసి వుంచండి సామి మళ్ళి వస్తాను. మీకు తెలీదూ పేమ లేకలు ఎట్టా రాయాలో? ఎన్ని సదివారో, ఎన్నిరాశారో"

ఇలా అనేసి వెళ్ళిపోయింది, గడుసుది చొక్కమ్మ.

మరో రెండు గంటలు పొయ్యాక చేతిలో వో కవరు పట్టుకొని రానే వచ్చింది.

"అడ్రేసు రాయి సామి, సెప్తన్నా"

ఆమె కాబోయె భర్త ఆర్ముగం అడ్రసు రాశాను. నేను రాసిన వుత్తరాన్ని వో సారి అటూ ఇటూ తిప్పి చూసింది. ఆమె కేం అర్థమవుతుంది?

ఐనా తృప్తిగా తల వూపి కవరులో పెట్టింది.

ఆమె మొహంలో సంతృప్తి వెల్లి విరిసింది. ఆనందంలో గెంతుతూ బయ టికి వెళ్ళబోయింది. కాని అప్పుడూ మరవ లేదు.

"చా కాపి తెస్తనా సామి?" అంది.

"ఏమి వద్దు తల్లి. భోజనానికి వెడు తున్నా. నువ్వా కవరు పోస్టులో వెయ్యి."

"వెయ్యక ఇంట్లోపెట్టి పూజసేస్తా నేంటి సామి, రేపే అందుకోదూ వుత్తరం?'

కళ్ళలో కాంతి, పెదవుల మీద కొంటె నవ్వు, లేడిలా పరిగెత్తింది చొక్కమ్మ

వారాలు గడిచాయి.

వో సాయంత్రం ఎప్పటిలాగా గది తుడిచాక బల్లమీద దుమ్ము గుడ్డతో తుడుస్తూ మెల్లిగా అడిగింది.

"ఇవాళ తీరికుందా సామీ నీకు?"

"ఏం? ఏం కావాలి?"

"మరేంలేదు. ఇంకో ఉత్తరం రాసి పెట్టాలి....." చిన్నగా నవ్వుతూ తల వంచు కుంది చొక్కమ్మ. ఆడజన్మ, పాపం.

అప్పుడు వ్రాసిన వుత్తరానికి జవాబు వచ్చిందా? ఏమని అడగటం?

"అలాగే రాసి వుంచుతాలె."

"అందులో రాయి సామి. నీ వుత్తరం అందింది, బానే వున్నాను అని" అంటూ వో కవరు బల్లమీదపెట్టి వెళ్ళబోయింది.

"చొక్కమ్మా"

"ఏం సామీ" తలుపు దగ్గర ఆగి అంది.

నా మనసు కాస్త కొంటెగా కదిలింది, "నాకు చూపించలేదేం నీ మొగుడి ఉత్తరాన్ని" అన్నా.

నవ్వుతూ క్రిందకు దిగి పోయింది.

మేడ మీద నా గది.

ఏమైనా గుమాస్తా పని తప్పలేదు నాకు. అక్కడ ఆఫీసులో గుమాస్తా, సాహిత్యంలో సరస్వతి గుమాస్తా, ఇప్పుడు చొక్కమ్మ గుమాస్తా!

తప్పేముంది? ఇది అలవాటయింది. ఎనిమిదో పదో ప్రణయ పత్రాలు రాశాను, చొక్కమ్మ కోసం ఆర్ముగానికి.

కాని భలె కిలాడి చొక్కమ్మ. వాడు రాసిన ఒక్క ఉత్తరమైనా నాకు చూపించ లేదు. దానివల్ల నాకేం నష్టం లేదనుకోండి.

రోజులాగె బీచ్‌కు వెళ్ళి ఆలస్యంగా తిరిగి వచ్చాను. నాగది కిటికీలో నుండి వెలుతురు దూరానికి కనిపించాల్సింది. ఇవాళ కనిపించటం లేదు.

మేడ మెట్ల దగ్గరేవో చిన్న గది. అదే చొక్కమ్మ బంగళా. మూడు రూపాయల న్నర దానికి అద్దె.

నేను వెళ్ళేసరికి జనం గుంపుగా చేరారు అక్కడ. పోలీసులూ వున్నారు.

"ఏమిటీ? ఏమిటిది? ఏం జరిగింది? అందరూ అడిగే వారే.

చొక్కమ్మ ఉరి పోసుకుంది.

పనికి రాలేదేమని పిలవడానికి వచ్చారట్ట అవతలి ఇంటివారు. అప్పటికే చొక్కమ్మ శవం దూలానికి వేలాడుతోంది. వెంటనే పోలీసులకు కబురు పంపించారు.

రోజులు దొర్లిపోయాయి.

ఇన్స్‌పెక్టర్ సుబ్రమణ్యం పాత స్నేహి తులు నాకు. ఏదో మాటల్లో చెప్పారు.

"మీ సర్వెంటు ముండ పిచ్చిదను కొంటానండి. బుద్ధి సరిగ్గా వున్నట్టు లేదు."

ఛ! చొక్కమ్మ పిచ్చిదా? నాన్సెన్స్.

చొక్కమ్మ గురించి అంత తేలిగ్గా మాట్లాడడం నచ్చలేదు నాకు.

"జీవితంలో ఆమెకేం బాధలుండేవో పాపం!"

సుభ్రమణ్యం ప్రారంభించారు.

"నేనంతా కనిపెట్టాను సార్. చాలా ఇంటరెస్టింగ్ కేస్ ఇది. వినండి" అంటూ దగ్గరగా వచ్చారు.

"సేలం దగ్గర సేతుపట్టి అని వో వూరు వుంది. అక్కడో టైలర్ వున్నాడు.

ఆర్ముగం అని వాడి పేరు."

ఆర్ముగం పేరు నాకు తెలియనిదా? పెదవులు బిగబట్టి మౌనంగా విన సాగాను.

ఆ ఆర్ముగం ఈ చొక్కమ్మా ఒకే వీధిలో చిన్నప్పటినుంచి ఆడుకున్న పిల్లలు సార్. ఇద్దరూ చిన్న పిల్లలుగా వున్నపుడే పెద్దవాళ్లు వీళ్ల పెళ్లి నిశ్చయం చేశారట. పెళ్ళయిందనే అనుకునేవారట అందరూ. ఈ ముండా అలాగే అనుకుందో ఏమిటో......"

"సుబ్రహ్మణ్యం?"

"ఏమిటి సార్" సుబ్రహ్మణ్యం ఆశ్చర్యంగా నా వేపు చూశారు.

"చూడండి, ఇంకోసారి ఆమెను ముండా, మోపి అనకండి, నా ఎదుట ఆమెను గురించి."

"బాగుంది, చెబుతున్నది వినరేం మీరు? అది నిజంగా పిచ్చిది సార్...... పూర్తిగా వినండి ముందు."

నా మనసులోని బాధ, అనుకంపని ఆయనకెలా తెలుస్తుంది!

"పెళ్లి వెలరోజులుందనగా ఎవడో డబ్బున్నవాడు పిల్లనిస్తా నన్నాడట. సరే దీన్నిలా వదిలేసి మరోదాన్ని చేసుకొన్నాడు వాడు."

"ఆ! ఆర్ముగానికి పెళ్ళయిందా? ఎప్పుడు?"

"ఆరేళ్ళయింది సార్ ఇదంతా జరిగి. వాడికిపుడు ముగ్గురు పిల్లలు. మళ్లీ కడుపుతో వుంది ఆ భార్య. అదలా వుండ నీయండి. వాళ్ల పెళ్లిరోజె ఈ చొక్కమ్మ వూరు వదిలి పారిపోయి వచ్చేసింది ఎవరికీ చెప్పకుండా. చచ్చిపోయిందనే అనుకున్నారట అందరూ. మళ్లీ వాడి మొహం చూడలేదు అది. ఇంతా అయిందా, ఇపుడు చెప్పండి దానికి పిచ్చవునో కాదో? వాడికేమో ఎవి. మిదో, వదో "లవ్ లెటర్స్" రాయించింది. అందులో కన్నడంలో! రాసిన వాళ్లెంతటి వెధవయ్యుండాలి? చూడండి ఆ వుత్తరాలన్నీ దొరికాయి నాకు."

"ఆర్ముగం దగ్గర దొరికాయా?"

"కాదు సార్! జాగ్రత్తగా దాచి వుంచింది. తన ఇంట్లోనే ఓ కుండలో. పోస్టులో వెయ్యనే లేదు. ఏం సైకాలజీ అనాలి దీనికి. ఆ ముండ పిచ్చిది కాకపోతే మరేమి టంటారు? మీరే చెప్పండి పోనీ."

నన్నెవరో సూదులతో గుచ్చుతున్నట్టని పించింది. ఆ దీనురాలి మొహం నా కళ్ళ ముందు మెదిలింది.

మెల్లిగా అటు తిరిగి కళ్ళు తుడుచు కున్నాను.

14—10—68

ఋతుక్రమం ఆలస్యమైతే?
విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవి పిల్సు" వాడండి
పూర్తికోర్సు ప్యాకెట్టు 28 మాత్రలు వెల రు 11/-
సగంకోర్సు ప్యాకెట్టు 14 మాత్రలు వెల రు 6/-
తపాలు ఖర్చు అదనము
ప్రతిచోట దొరకును


"దేవి పిల్సు" ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగా కాక పోయిన, బాధతో కూడిన, లేక ఆగిపోయిన బహిష్టకు దేవి పిల్సు బాగుగ గుణమిచ్చును
1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు
MFRS. SEENU & CO., MADRAS-21
స్టాకిస్టులు: సిటీ ఫార్మ డిస్ట్రిబ్యూటర్స్, రాంగోపాల్ వీధి, విజయవాడ-1.

ఇప్పటి నుంచి తప్పక పరిశుభ్రకరమైన, ఆరోగ్యకరమైన స్నానానికి — వాడండి.
కొత్త
పెద్దది, ఎర్రనిది నహాన్
క్రెసిల్‌తో గూడినది
ఇప్పటి నుంచి మీరు కొత్త పెద్దది, ఎర్రనిది, నహాన్‌తో ఆనందంగా రోజూ స్నానం చెయ్యండి. ఈ పెద్దది, ఎర్రని స్నానపు సబ్బుతో, మీకు అన్ని టపిమించిన పరిశుభ్రకరమైన, ఆరోగ్యకరమైన స్నానమును సమకూర్చే క్రెసిల్ వున్నది! రోజూ నహాన్‌తో స్నానం చెయ్యండి; అది ఆరోగ్యకరమైన అలవాటు, మరిగుర్తుంచుకోండి: నహాన్ పెద్దది — చాలా ఎక్కువ ఆరోగ్యకరమైన స్నానములకు వనికివచ్చును.


ఒక టాటా ఉత్పత్తి
CMTN-1A-TL